
# ఆత్మ(బ) హత్య

## వీరభద్రరావ్ పమ్మి



కథ

***పార్వతి వారం రోజుల్నుంచి ఆలోచిస్తోంది. ఈ విషయం మొగుడికి చెప్పాలా, వద్దా... చెపితే అతను ఏమనుకుంటాడో? చెప్పకపోతే...? పార్వతి పది రకాలుగా ఆలోచిస్తోంది. మరో రకంగా అసలు విషయం భర్తకి చెప్పేస్తే గుండె మీద బరువు తగ్గిపోతుంది. కానీ చెప్పేస్తే అతను అసహ్యించుకోవచ్చు.***

***అసలు- ఈ విషయం జరిగి చాలా సంవత్సరాలు అయ్యింది. భర్తకి చెబుదామని ఎప్పుడూ అనుకోలేదు. ఒక వారం క్రితం డాక్టరు అసలు విషయం చెప్పడం... అప్పటి నుంచి పార్వతికి అపరాధ భావం కలగడం. అసలు భర్తకి చెప్పడమా? మానడమా? అన్న తర్జన భర్జనలో ఆమె మెదడు మొద్దుబారిపోయింది.***

** ** **

పార్వతికి దాదాపు అరవై ఏళ్ళు వచ్చాయి. ఆమె భర్త నరసింహమూర్తికి అరవై అయిదు ఏళ్ళు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు. ఇద్దరు మగపిల్లలు మంచి చదువులు చదువుకొని, విదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. నరసింహమూర్తి దంపతులకు నగరంలో మంచి మేడ ఉంది. ఆ ఇంట్లో వాళ్ళిద్దరు ఉండటమే కాక, మరో నాలుగు వాటాలు అద్దెకు ఇచ్చారు. ఆ దంపతులు అద్దెకు ఉండేవాళ్ళకి కాకుండా- చుట్టు పక్కల వారికి, తెలుసున్న వాళ్ళకి, చుట్టాలకి ఎంతో సహాయం చేస్తుంటారు.

"దేముడు నన్ను, నా భార్యని, నా పిల్లల్ని ఎంతో దయగా చూసాడు. నేను చదువుకున్నప్పుడు ఎంత కష్టపడ్డానో, ఉద్యోగంలో చేరాక ఏ కష్టమూ పడలేదు. నా పిల్లలు బుద్ధిగా, చక్కగా చదువుకొని మంచి మంచి ఉద్యోగాల్లో చేరారు. మా కొడుకులిద్దరికీ వాళ్ళకి కావలసిన పిల్లల్నిచ్చి పెళ్ళిళ్ళు చేశాం. వాళ్ళు కూడా ఎంతో ఆనందంగా, హాయిగా ఉన్నారు.

నేను పెద్ద మేడ కట్టాను. 'కారు' లాంటి సౌకర్యాలన్నీ చాలా సంవత్సరాల క్రితమే సంపాదించుకొన్నాను. భగవంతుడు అన్ని రకాలా నన్ను చల్లగా చూసాడు. అన్నిటికీ మించి నా భార్య పార్వతి ఉత్తమురాలు. ఎప్పుడూ నన్ను ఏ రకంగానూ ఇబ్బంది పెట్టలేదు. తూర్పు దిక్కు చూపించి ఇది పశ్చిమం అంటే అవును, నిజమే పశ్చిమమే అంటుంది.

ముఖ్యంగా మా పిల్లల్ని పెంచడం, మంచి చదువులు చదివించడం లాంటి బాధ్యతలు పార్వతే తీసుకుంది. తెలుసున్న వాళ్ళకి, చుట్టాలకి ఎలాంటి కష్టము కలిగినా వెంటనే ఆర్థిక సహాయం, మాట సహాయం చేయడం పార్వతికి మొదటి నుంచి అలవాటు. ఈ అలవాటు ఆమెను చూసి నేను నేర్చుకున్నాను.

దాదాపు పదేళ్ళ క్రితం మా నాన్న పినతండ్రి కొడుకు దిక్కులేని పరిస్థితిలో అనారోగ్యంతో బాధపడుతుంటే అతన్ని మా ఇంటికి రప్పించి ఒక సంవత్సరం పాటు అతన్ని ఇంట్లో అట్టేపెట్టుకుని శుశ్రూషలు చేసి, వైద్యం చేయించి మామూలు మనిషి అయ్యాక ఆయనను వాళ్ళింటికి పంపించింది.

ఇలా చెప్పాలంటే ఒకటి కాదు, రెండు కాదు అనేక రకాలుగా, ఒక మంచి మనిషిగా పార్వతి పేరు తెచ్చుకుంది.

మా పిల్లల అనారోగ్యం గురించి డాక్టరు చెప్పినప్పుడు నరసింహమూర్తి ఈ విషయాన్ని గుర్తు తెచ్చుకున్నాడు. ఇప్పుడే కాదు ఎన్నోసార్లు ఈ విషయాల్ని గుర్తు తెచ్చుకోవడమే కాకుండా మిత్రులకీ, చుట్టాలకీ ఎన్నోసార్లు చెప్పాడు.

పార్వతికి జ్వరం వస్తుంటే అదేదో మామూలు జ్వరం అనుకున్నాడు. ఎన్ని మందులు వాడినా జ్వరం తగ్గట్లేదు. ఓ పెద్ద ఆస్పత్రిలో ఆమెను చేర్పించి, పెద్దపెద్ద డాక్టర్లకు ఆమెను చూపించాడు. వాళ్ళు అన్ని రకాల టెస్ట్‌లు చేసి, చివరకు ఆమె అనారోగ్యం 'లివరు వ్యాధి' అని నిర్ధారించారు. ఆమెకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరేషన్ చేయాలి. ఆపరేషన్ చేస్తే నూటికి తొంభై తొమ్మిది వంతులు ఆపరేషన్ ఫెయిల్ అవుతుంది. ఆపరేషన్ చేయకపోతే నూటికి నూరు వంతులూ చనిపోతుంది. అంటే ఆమె బతకడానికి, చావడానికీ మధ్య నూటికి ఒక శాతం తేడా ఉంటుంది.

ఈ విషయం డాక్టరు చెప్పినప్పుడు నరసింహమూర్తి మరో రకంగా ఆలోచించలేదు. అతనికి డబ్బు ఇబ్బంది లేదు. ఈ విషయం తెలిసిన అతని కొడుకులూ ఆపరేషన్ చేయిద్దామని ధైర్యం చెప్పారు.

తన అనారోగ్యం గురించి ఎంత దాచినా, అది చాలా ఇబ్బందికరమైన అనారోగ్యమని, ఆపరేషన్ చేసినా బతకడం కష్టమని పార్వతికి స్పష్టంగా తెలిసిపోయింది. అప్పట్నుంచి మానసిక మధన ప్రారంభమైంది.

"నూటికి తొంభై తొమ్మిది వంతులు నేను చనిపోతాను. చనిపోయే లోపు నా మనసు చీకటిలో దాచుకున్న రహస్యం ఆయనకి చెప్పాలి. చెప్పడం వల్ల ఉపయోగమేమిటి? ఉపయోగం ఉంటుందో లేదో వేరే విషయం- దాచిన ఆ ఒక్క విషయం ఆయనకు చెప్తే నా మనసు మీద బరువు తగ్గుతుంది. ఏమైనా సరే ఆ విషయం ఆయనకు చెప్పాలి...! చెప్పాలి...! చెప్పాలి...!

** ** **

నరసింహమూర్తి చాలా కష్టాలు పడ్డాడు. చెప్పులు లేకుండా ముళ్ళ డొంకల్లో, బురద దారుల్లో నాలుగు మైళ్ళు నడిచి స్కూల్‌కి వెళ్ళేవాడు. ఆ తర్వాత ఎవరి దయతోనో కాలేజీలో చదువుకున్నాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసాడు. చదువు పూర్తయిన తరువాత వెంటనే ఉద్యోగం

దొరికింది. పార్వతి తండ్రి ఆమెనిచ్చి పెళ్ళి చేసారు. ఆ తరువాత అతను ఇంకెప్పుడూ ఏ రకమైన కష్టమూ పడలేదు. అతన్ని చదివించిన వాళ్ళకీ, సహాయపడిన వాళ్ళకీ ఎప్పుడూ కృతజ్ఞత చూపించేవాడు. అంతేకాదు వాళ్ళకి ఏ రకమైన కష్టం కలిగినా ఎంతో సహాయం చేసేవాడు. నరసింహమూర్తి చాలా మంచివాడు. అందరిలోనూ మంచి పేరు తెచ్చుకున్నాడు.

కానీ...అనుక్షణం అతనికి చిన్నతనం జ్ఞాపకం వస్తుండేది. ఆ రోజుల్లో తను పడ్డ కష్టాలు, నష్టాలు, దారిద్ర్యం, లేమి జ్ఞాపకం వచ్చి వణికిపోతుండేవాడు. అన్ని కష్టాలకీ, బాధలకీ, అన్ని రకాల లేమికీ ఒకే ఒక్క కారణం; డబ్బు లేకపోవడం. కాబట్టి ఎపుడూ చేతినిండా డబ్బు ఉండాలి. ఎప్పుడూ డబ్బు సంపాదించాలి. చేతినిండా డబ్బు ఉంటే జీవితంలో చాలా రకాల సమస్యలు పరిష్కారమవుతాయి. ఉన్నంతలో దర్జాగా, హాయిగా, ఆనందంగా బతకాలి. మనిషి పీనాసిగా బతక్కూడదు. మరి చేతినిండా డబ్బులు ఎలా ఉంటాయి? దానికి ఒకటే జవాబు.

ఇంకా డబ్బు సంపాదించాలి. ఎక్కువ కష్టపడాలి. మొదటి నుంచి నరసింహమూర్తి ఆలోచన ఇలాగే ఉండేది. అందుకే అతనికి విదేశాల్లో ఉద్యోగం దొరికితే వెడతానని అన్నాడు.

దొరికిన ఉద్యోగం మంచిదే, పెద్దదీనూ. హైదరాబాద్‌లో వచ్చే జీతంకన్నా రెండు రెట్లు ఎక్కువ జీతం. కానీ ఆ కొత్త ఉద్యోగంలో పిల్లలు మంచి చదువులు చదువుకోలేరు. శుభ్రమైన తిండి దొరకదు. రేకుల షెడ్డుల్లాంటి ఇళ్ళల్లో నివాసం ఉండాలి.

ఈ విషయం గూర్చి నరసింహమూర్తి, భార్య తర్జన భర్జనలు పడేవారు.

"ఏమండీ! మీరు మంచి ఉద్యోగంలో ఉన్నారు. ఏ రకంగానూ మనకి లోటు లేదు. ఉన్నదానితో తృప్తితో బతుకుదాం. అన్నిటికీ మించి మీరు, నేను, పిల్లలు ఒకచోట ఉండవచ్చు. మీరు దేశంగాని దేశంలో, తిండి కాని తిండి తింటూ ఉన్న సుఖం వదులుకుని ఆ దేశానికి వెళ్ళడం మంచిది కాదని నా ఉద్దేశం. ఈ విషయాన్ని మీరూ ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అని చెప్పింది పార్వతి.

నరసింహమూర్తి ఆమె సలహాని దృష్టిలో పెట్టుకుని చాలాసార్లు ఆలోచించాడు. అతని మనసు త్రాసులో 'జీతం ఎక్కువ వస్తోంది' అన్న విషయమే బరువు తూగింది.

మంచి ఇల్లు కట్టుకోవాలి. కారు కొనుక్కోవాలి. భార్యా, పిల్లలకి ఏ లోటూ లేకుండా చక్కగా చూసుకోవాలి. అన్నిటికీ మించి జీవితంలో డబ్బుకి ఇబ్బంది పడకూడదు. చిన్నతనం లాంటి చీకటి జీవితం మళ్ళీ రాకూడదు. నరసింహమూర్తి విదేశపు ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. తను వెళ్ళిపోయిన కొత్తలో పార్వతీ, పిల్లలూ బెంగ పెట్టుకున్నారు.

కానీ పార్వతికి భర్తమీద కోపం రాలేదు. ఆమెకు అతని మనస్తత్వం బాగా తెలుసు.

"నాకూ, పిల్లలకి మరిన్ని సుఖాలు ఏర్పాటు చేద్దామన్న ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు" అని పార్వతి అనుకుంది.

మరో సంవత్సరం తర్వాత, పార్వతికి ఓ ఫంక్షన్‌లో నారాయణరావు కనిపించాడు.

నారాయణరావు పార్వతికి తల్లి తరఫు దూరపు చుట్టం. అతనికి పార్వతి అంటే మొదటి నుండీ ఎంతో ఇష్టం. అతను పెద్దగా చదువుకోలేదు. ఏవో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుండేవాడు. పార్వతికి పెళ్ళి చేయాలని ఆమె తండ్రి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలిసి, నారాయణరావు అతన్ని కలిసి "నేను ఎందుకో మొదటి నుంచీ పార్వతి మీద విపరీతమైన ఇష్టం పెంచుకున్నాను. మీరు దయ ఉంచి పార్వతిని నాకిచ్చి పెళ్ళి చేస్తే ఆమెను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాను. నేను పెద్దగా చదువుకోలేదు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని బతుకుతున్నాను. నా సంపాదనతో మేమిద్దరం హాయిగా బతకగలం. ఇవాళ కాకపోతే రేపు నేను మంచి వ్యాపారం చేసుకుని ఎంతో డబ్బు సంపా



"నేను ఎందుకో మొదటి నుంచీ పార్వతి మీద విపరీతమైన ఇష్టం పెంచుకున్నాను. మీరు దయ ఉంచి పార్వతిని నాకిచ్చి పెళ్ళి చేస్తే ఆమెను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాను. నేను పెద్దగా చదువుకోలేదు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని బతుకుతున్నాను. నా సంపాదనతో మేమిద్దరం హాయిగా బతకగలం".

దించగలను. నా మీద నాకు అచంచలమైన విశ్వాసం ఉంది. నేను పార్వతిని చేసుకుంటే ఎంతో వృద్ధిలోకి రాగలనని నా నమ్మకం. దయ ఉంచి పార్వతిని నాకిచ్చి పెళ్ళి చేయండి" అని నారాయణరావు పార్వతి తండ్రిని పదే పదే బతిమాలాడు.

"నారాయణరావుకి మంచి చదువు లేదు. ఆస్తి లేదు. అతని సంపాదన అంతంత మాత్రమే. నిజానికి నారాయణరావు మంచి వాడే. కానీ...అతనికి పిల్లనిచ్చి పెళ్ళి చేయడానికి మంచితనం ఒకటే సరిపోదు". పార్వతి తండ్రి ఆలోచించాడు. అదే విషయం చెప్పి నారాయణరావుకి పార్వతినిచ్చి పెళ్ళి చేయనని స్పష్టంగా చెప్పాడు. కొన్నాళ్ళ తర్వాత పార్వతికి నరసింహమూర్తిని ఇచ్చి పెళ్ళి చేసాడు.

నారాయణరావు రకరకాల వ్యాపారాలు మార్చి, కలకత్తాలో చాలా పెద్ద వ్యాపారం మొదలుపెట్టాడు. అతను పట్టుకున్నదల్లా బంగారమయింది. బొంబాయిలో, అహ్మదాబాద్‌లో, హైదరాబాద్‌లో, విశాఖపట్నంలో బ్రాంచిలు పెట్టుకుని కోటికి పడగలెత్తాడు.

ఫంక్షన్‌లో ఒకరినొకరు గుర్తు తెచ్చుకుని మంచి- చెడ్డా మాట్లాడుకున్నారు. "ఎవరి అదృష్టం ఎలా మారుతుందో తెలీదు. నన్ను పెళ్ళి చేసుకుంటే అతను తనని సుఖపెట్టలేడని నారాయణరావుకి చేయనని" మా నాన్న అనుకున్నాడు. కానీ నారాయణరావు కోటికి పడగలెత్తాడు. అన్నింటికీ మించి నన్ను పెళ్ళి చేసుకోలేదని నారాయణరావు జీవితంలో పెళ్ళే మానుకున్నాడు. ఆ విషయం తెలిసి నా మనసు కలవరపడింది".

నిజానికి మా పెళ్ళికి ముందు నారాయణరావుతో ఎక్కువసార్లు కలిసింది లేదు. అతనితో ఎక్కువ మాట్లాడింది లేదు. అతను మాత్రం నా పట్ల ఆరాధన పెంచుకున్నాడు. ఆ విషయమూ అప్పట్లో నాకు తెలీదు. ఆ మధ్య ఫంక్షన్‌లో కలవడం, తర్వాత తర్వాత అతన్ని కలుస్తూండడం, అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకోవడం జరుగుతోంది.

ఏ ప్రత్యేకతా లేని నామీద అంత ఇష్టం, ఆరాధనా భావం పెంచుకోవడం, వైవాహిక జీవితాన్ని త్యాగం చేయడంవల్ల అతనిమీద ప్రత్యేక ఇష్టం పెరిగింది. మాటిమాటికి అతన్ని కలవడం, ఫోన్‌లో మాట్లాడడం, దానికి తగినట్లు మా ఆయన ఊళ్ళో లేకపోవడం, పిల్లలు పొద్దుటే స్కూలుకి వెళ్ళి సాయంత్రం ఇంటికి రావడం.. .మొదలైన కారణాల వల్ల నేను నారాయణరావుతో మానసికంగా దగ్గరయ్యాను. తర్వాత అతనితో లైంగిక సంబంధం పెంచుకున్నాను. అలా జరగడం తప్పు అయితే పూర్తిగా ఆ తప్పు నాదే. అతనిది కాదు. అతను నేను ఈ తప్పు చేసేముందు ఒకటికి పదిసార్లు నన్ను హెచ్చరించాడు. మనం మంచి స్నేహితులుగా ఉండిపోదామన్నాడు. కానీ నేనే ముందడుగు వేసాను.

నేను చేసింది తప్పా, కాదా? అన్న విషయం అప్పుడూ ఆలోచించలేదు. తర్వాతా ఆలోచించలేదు.

నిజానికి నారాయణరావు నన్ను మానసికంగా, శారీరంగా ఎంతో సుఖపెట్టాడు. మేం ఇద్దరం కలిసి ఎన్నోసార్లు పెద్ద పెద్ద హోటళ్ళకి వెళ్ళేవాళ్ళం, షికార్లకి వెళ్ళేవాళ్ళం. మేమిద్దరం కొత్త దంపతుల్లాగ ఎంతో అనుభవించాం. ఎవరికీ తెలీకుండా మేం రహస్యంగా కలవడానికి నగరానికి దూరంగా ఒక పెద్దతోట మధ్యలో అతను ఓ ఇల్లు కట్టాడు. పైగా ఒకసారి పొద్దున్నే నన్ను విమానంలో బొంబాయి తీసు

చనిపోయేముందు ఎవ రైనా తప్పు ఒప్పుకుంటే వాళ్ళు తప్పకుండా స్వర్గానికే వెళతారట. ఆ రకంగా నేను తప్పు ఒప్పుకుని, ఒప్పుల కుప్పగా మారిపోతాను. నేను చనిపోయిన వెంటనే స్వర్గానికి వెళ్ళిపో యి నారాయణరావుకళ్ళల్లోకి చూస్తూ... నాకు మళ్ళీ స్వర్గం...నిజంగా స్వర్గం.

కెళ్ళి, సాయంత్రం విమానంలో ఇంటికి తీసుకు వచ్చాడు. ఎన్నో రకాల ఆనందాలు, సుఖాలు... అందించేవాడు.

మా ఆయన దేశంలో ఉన్నప్పుడు నారాయణరావు నాకు దూరంగా ఉండేవాడు. మా ఆయనకు కానీ, పిల్లలకు కానీ ఏ రకమైన అనుమానం రాకుండా జాగ్రత్త పడేవాళ్ళం.

రాను రాను నారాయణరావు మీద ఆరాధనా భావం పెరగడమే కాకుండా, అతను లేని జీవితం నిస్సారం అనిపించడం మొదలైంది. ఎన్నోసార్లు ఆయన్ని వదిలేసి నారాయణరావుతో కలిసి బతుకుదామన్న ఆశ మొదలైంది.

ఇలా దాదాపు రెండేళ్ళు అతనితో అన్ని రకాల అనుబంధాలు, అనుభవాలు పెంచుకున్నాను. మా ఆయన్ని వదిలేసి నారాయణరావుతో కలిసి బతకడం మొదలెడితే నా పిల్లల్ని ఏం చేయాలి? అన్న అనుమానం నన్ను పీడించేది. ఓసారి ఈ విషయమై నారాయణ రావుతో మాట్లాడితే "నీ పిల్లలు నా పిల్లలే. నాకు అభ్యంతరం లేదు" అన్నాడు. కానీ సమాజం, బంధువులూ వీళ్ళందరితో రకరకాల సమస్యలు. ఈ సమస్య ఎప్పటికీ తెమలదు.

ఏం చేయాలి...? ఏం చేయాలి?

ఈ సమస్య మరో రకంగా పరిష్కారం అయింది.

ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్ళే కారులో ప్రయాణిస్తూ నారాయణరావు యాక్సిడెంట్‌లో చనిపోయాడు.

ఇలా జరిగాక నా మనసు పచ్చిపోయింది. నాకు జీవితం మీద ఆశ, ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయాయి. జీవితం మీద ఆపేక్ష, ఉత్సాహం ఎందుకు చచ్చిపోయాయో మా ఆయనకి అర్థమయ్యేది కాదు.

ఎటువంటి మానసిక రోగాన్నయినా కాలం మాన్పుతుంది. మరో రెండు సంవత్సరాల తర్వాత మా ఆయన మన దేశానికి వచ్చేసారు. మళ్ళీ ఆయనతో, పిల్లలతో...జీవితం మామూలు అయిపోయింది.

నేను ఒక్కదాన్నే కూర్చున్నప్పుడు, నిద్రపోయేముందు కళ్ళు మూసుకొని నారాయణరావుని జ్ఞాపకం తెచ్చుకుంటే- అతనితో కలిసి బతికిన క్షణాలు నాకెంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అతను చనిపోయిన విషయం జ్ఞాపకం వచ్చి కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతాయి.

నారాయణరావుతో కలిసి బతికిన రోజులు గడిచి దశాబ్దాలు అయ్యింది. నా మనసుమీద, గుండెలమీద ఓ ముద్ర చిత్రించిన నారాయణరావు వేరే లోకాల్లోకి వెళ్ళిపోయాడు. ఈ విషయాలు తలుచుకున్నప్పుడల్లా నా గుండె బరువెక్కిపోతుంది.

త్వరలో నేను కూడా వేరే లోకాల్లోకి వెళ్ళిపోతాను. చచ్చినవాళ్ళు స్వర్గంలోనో, నరకంలోనో సెటిలవుతారట. అది నిజమైతే నేను స్పష్టంగా నరకానికే వెళతాను. నారాయణరావు మాత్రం తప్పకుండా స్వర్గంలోను ఉంటాడు. అతను బతికున్నన్నాళ్ళూ నాకు స్వర్గమే చూపించాడు. నేను మా ఆయన్ని మోసం చేసి నారాయణరావుతో తిరగడం తప్పు అయితే కనుక ఆయనకి నిజం చెప్పి క్షమించమని కోరుకుంటాను. చనిపోయేముందు ఎవరైనా తప్పు ఒప్పుకుంటే వాళ్ళు తప్పకుండా స్వర్గానికే వెళతారట. ఆ రకంగా నేను తప్పు ఒప్పుకుని, ఒప్పుల కుప్పగా మారిపోతాను. నేను చనిపోయిన వెంటనే స్వర్గానికి వెళ్ళిపోయి నారాయణరావుకళ్ళల్లోకి చూస్తూ... నాకు మళ్ళీ స్వర్గం...నిజంగా స్వర్గం.

మరో రెండు రోజుల్లో ఆపరేషన్ జరుగుతుంది అనుకుంటుండగా పార్వతి మళ్ళీ ఈ విషయాలన్నీ గుర్తు తెచ్చుకుంది. ఓ కాగితం మీద నారాయణరావుతో తాను కలిసి చేసిన తప్పు గురించి క్లుప్తంగా రాసి, నరసింహమూర్తికి అందజేసింది. ఆ విషయం తెలిసిన నరసింహమూర్తి పగలంతా మౌనంగా పార్వతికేసి చూస్తూ ఊరుకున్నాడు. చీకటిపడ్డాక పార్వతి అతన్ని దగ్గరికిపిలిచి "ఏమండీ! నేను తప్పు చేసానా?" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"జరిగిందేదో జరిగింది. ఆ విషయం మర్చిపో, నేనూ మర్చిపోతాను. నీ ఆరోగ్యం బాగా లేదు. ఆపరేషన్ విజయవంతమయ్యాక మళ్ళీ మనిద్దరం సుఖంగా, ఆనందంగా బతుకుదాం" అని పార్వతి చేయి పట్టుకున్నాడు నరసింహమూర్తి.

ఆపరేషన్ జరిగింది. పార్వతి బతికింది. అసాధ్యం అనుకున్నది సాధ్యమైంది.

కానీ "ఆ విషయం మర్చిపో, నేనూ మర్చిపోతాను" అన్న నరసింహమూర్తి ఆ విషయం మర్చిపోలేకపోయాడు. పైగా మాటి మాటికి పార్వతికి గుర్తు చేస్తుండేవాడు.

మరో నెల రోజుల తర్వాత...

నరసింహమూర్తి వల్ల జరుగుతున్న మానసిక హింసను, ఆత్మక్షోభను తట్టుకోలేక విషం తీసుకుని పార్వతి ఆత్మహత్య చేసుకుంది. ●